సాక్షి
ప్రకాశం

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



బాలికలకు కేజీబీవీల పిలుపు

జిల్లాలోని 28 కస్తూర్బా పాఠశాలల్లో 6వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈనెల 11వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి. - 8లో..



తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
36/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో వర్షం పడవచ్చు. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సాగు ఖర్చు తగ్గించండి

- పంట దిగుబడులు పెంచి, అధిక ఆదాయం దిశగా అడుగులు వేయాలి
- ఉద్యాన, బిందు సేద్యం, ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి సారించాలి
- వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: జిల్లాలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలపై దృష్టి సారించి ప్రతి రైతుకు వ్యవసాయ ఖర్చు తగ్గించేలా చూడాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో సమావేశమై ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, దాని అనుబంధ శాఖల్లో వృద్ధి రేటు పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పంట దిగుబడులు పెంచేలా, రైతులు అధిక ఆదాయం పొందేలా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ప్రణాళికలు రూపొందించాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ వినియోగం ముందు, తరువాత ఎంత పంట దిగుబడి వచ్చిందో సమగ్రంగా పరిశీలించి నివేదికలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, గ్రామస్థాయిలో సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లాలోని ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ విధానంలో ప్రకృతి వ్యవసాయం అవలంబించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో సూక్ష్మ సేద్యం విధానాన్ని మరింతగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పాల ఉత్పత్తి పెంచడానికి ఏఏ చర్యలు తీసుకోవాలి, ప్రస్తుతం పాడి పశువులపై కుటుంబానికి ఎంత ఆదాయం వస్తుంది, తదితర విషయాలను సమగ్రంగా విశ్లేషించి నివేదిక రూపొందించాలని పశు సంవర్ధక శాఖ అధికారులకు సూచించారు. పంటకు మంచి గిట్టుబాటు ధర లభించేలా మార్కెట్ సదుపాయాలపై కూడా నివేదిక అందజేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ డా.బేబి రాణి, హార్టీకల్చర్ అధికారి గోపీచంద్, ఏపీ ఎంఐపీ పీడీ రమణ, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి సుభాషిణితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

రొయ్యలపై సుంకం రద్దు చేయాలి

ఒంగోలు సబర్బన్: అమెరికాలో రొయ్యల దిగుమతిపై 26 శాతం సుంకం విధించడం దుర్మార్గమని రొయ్యల రైతుల సంఘ జిల్లా అధ్యక్షుడు దుగ్గినేని గోపీనాథ్ పేర్కొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే కలుగజేసుకుని ట్రంప్ విధించిన సుంకాన్ని రద్దు చేయించాలని కోరారు. లేదంటే ఆ ప్రభావం ఇక్కడి రొయ్యల గిట్టుబాటు ధరలపై పడుతుందన్నారు. ఇప్పటికే భారతదేశ రొయ్యలపై అమెరికా డంపింగ్ డ్యూటీ పేరుతో 3.88 శాతం, కౌంటర్ వయలింగ్ డ్యూటీ 5.77 శాతం విధించిందని, ట్రంప్ తాజాగా విధించిన సుంకంతో కలుపుకొంటే మొత్తం 35.65 శాతం భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



మద్యం ఏరులై పారుతోందన్నమాట తక్కువే అవుతుంది జిల్లాలో పరిస్థితిని పరిశీలిస్తే... పల్లె..పట్నం అన్న తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్న బెల్టు దుకాణాలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వీధి చివర, ఇంటి పక్కన... ఇలా ఎక్కడ చూసినా మద్యం అమ్మకాలే. బైకులు, ఆటోల్లో, సంచార దుకాణాల ద్వారా డోర్ డెలివరీ జోరుగా సాగుతోంది. అధికార కూటమి నేతల అండదండలతో ఈ వ్యాపారం వర్ధిల్లుతోంది. ఊళ్లని మత్తులో ముంచేస్తున్న బెల్టుషాపుల దుకాణాలపై కథనం...

- ఊరూరా బెల్టు దుకాణాలు..
- మోటారు సైకిళ్లు, ఆటోల్లో ఇంటింటికీ మద్యం
- మంచినీరు దొరకని గ్రామాల్లో సైతం కావాల్సినంత మందు
- ప్రభుత్వ పాలసీతో భారీగా పెరిగిన మందుబాబులు
- ఒంగోలు, మార్కాపురం డిపోల పరిధిలో రూ.1100 కోట్ల అమ్మకాలు
- అధికారులకు నెలనెలా మామూళ్లు ఇవ్వాల్సిందే..

ఒంగోలు డిపో పరిధిలో మద్యం అమ్మకాలిలా..			
నెల	లిక్కర్ కేసులు	బీరు కేసులు	విలువ రూ.కోట్లలో
అక్టోబర్ (16వ తేదీ)	82,613	20,320	69.44
నవంబర్	1,06,755	30,372	85.2
డిసెంబర్	1,23,184	33,682	98.51
జనవరి	1,23,777	37,457	96.75
ఫిబ్రవరి	1,21,559	48,844	95.86
మార్చి	1,28,028	67,772	103.04

నియోజకవర్గం	అధికారిక మద్యం షాపులు	బెల్టుషాపులు
మార్కాపురం	23	100
దర్శి	24	500
యర్రగొండపాలెం	19	360
సంతనూతలపాడు	26	300
ఒంగోలు కార్పొరేషన్	21	50
గిద్దలూరు	27	129
కనిగిరి	21	140
కొండపి	22	320

మామూళ్ల మత్తు..

జిల్లాలోని అన్నీ ఎక్సైజ్ పోలీసు సర్కిళ్ల అధికారులు నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నారని ప్రచారం జరుగుతోంది. పశ్చిమ ప్రకాశంలోని యర్రగొండపాలెం ఎక్సైజ్ సీఐ రెస్టారెంట్లు, ధాబాల నుంచి నెలకు రూ.5 వేల చొప్పున మామూళ్లు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దాంతో త్రిపురాంతకం రోడ్డులో ఒక మద్యం దుకాణం రోజుకు 24 గంటలు మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జికి నియోజకవర్గంలోని అన్నీ మద్యం దుకాణాలు నెలకు రూ.50 వేల చొప్పున ట్యాక్స్ చెల్లించాల్సి వస్తోందని టీడీపీ నాయకులు, కార్యకర్తలే చెవులు కొరుక్కుంటున్నారు. దానికి తోడు ఎక్సైజ్ అధికారులకు నెలవారీ మామూళ్లు ఇవ్వాల్సి రావడంతో మద్యం వ్యాపారులు రూ.40 నుంచి రూ.50 అధిక ధరలకు అమ్ముతున్నారు.

ఊళ్లు ఊగిపోతూ..
నేతలకు కిక్కిస్తూ!

ఒంగోలు టౌన్: జిల్లాలో 188 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో భాగంగా తొలి విడతగా 171, ఆ తరువాత గీత కార్మికులకు మరో 10 శాతం అంటే 17 దుకాణాలను కేటాయించింది. వీటన్నింటినీ అధికార పార్టీ నేతలు సిండికేట్‌గా ఏర్పాటై వీటిని దక్కించుకున్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకుని మద్యం వ్యాపారులు రెచ్చిపోతున్నారు. అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుడడంతో వీటికి అనుబంధంగా 2 వేలకుపైగా బెల్టు షాపులు వెలిశాయి. ఊరూరుకి మద్యం సరఫరా చేస్తూ ఇంటింటికీ మద్యం డెలివరీ చేస్తున్నారు. ఇప్పుడు జిల్లాలో మంచినీరు దొరకని గ్రామాలు అనేకం ఉన్నాయి. కానీ మద్యం లభించని గ్రామం ఒక్కటంటే ఒక్కటి కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు. ఒక్క ఫోన్ కొడితే చాలు క్షణాల్లో మద్యం ఇంటి ముందు ప్రత్యక్షమవుతోంది.

ఐదున్నర నెలల్లోనే రూ.1100 కోట్ల అమ్మకాలు

గత ఏడాది అక్టోబర్ 16వ తేది నుంచి ప్రైవేటు దుకాణాలను తెరచి మద్యం విక్రయాలను ప్రారంభించారు. అంతకుముందు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నప్పుడు జరిగిన వ్యాపారం కంటే ఇప్పుడు 20 నుంచి 30 శాతానికి పైగా మద్యం విక్రయాలు పెరిగాయి. జిల్లాలో ఒంగోలు, మార్కాపురంలలో లిక్కర్ డిపో ఉన్నాయి. ఒంగోలు డిపో పరిధిలో ఒంగోలు, సింగరాయకొండ, చీరాల, పర్చూరు, అద్దంకి, కందుకూరు సర్కిళ్లు ఉన్నాయి. మార్కాపురం డిపో పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, పొదిలి, దర్శి, గిద్దలూరు సర్కిళ్లు ఉన్నాయి. ఒంగోలు డిపో పరిధిలో గత ఏడాది అక్టోబర్ 16వ తేదీ నుంచి మార్చి నెలాఖరు వరకూ మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్ల ద్వారా లిక్కర్, బీర్ల అమ్మకాలు దాదాపు రూ.550 కోట్లు జరిగాయి. మార్కాపురం డిపో పరిధిలో సైతం రూ.550 కోట్ల అమ్మకాలు జరిగాయని అధికారులు చెబుతున్నారు. మొత్తం మీద ఐదున్నర నెలల్లో సుమారు రూ.1100 కోట్ల విక్రయాలు జరిగాయి.

2 వేలకు పైగా బెల్టు షాపులు:

జిల్లాలో 188 మద్యం దుకాణాలు ఉండగా 2 వేలకు పైగా బెల్టుషాపులు ఉన్నాయి. జిల్లాలోని ప్రతి పల్లెల్లోనూ మద్యం ఏరులై పారుతోంది. ఒంగోలు నగరంలోని అన్నీ శివారు ప్రాంతాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. నగరంలోని ఎఫ్‌సీఐ గోడౌన్ ఎదురుగా, కొప్పోలు, దశరాజుపల్లి, కరవది, పేర్నమిట్ట, ఉలిచి, వెంగముక్కలపాలెం తదితర గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ఒక్కో గ్రామంలో రెండు మూడు బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, కొండపి నియోజకవర్గాల పరిధిలోని అన్నీ గ్రామాల్లో బెల్టుషాపులు నడుస్తున్నాయి. జిల్లాలో మద్యం విక్రయాలు అధికార తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, వారి బినామీల పేర్లతో నిర్వహిస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ అధికారులు బెల్టు షాపుల వైపు కన్నెత్తి చూడడం లేదు. పక్కా సమాచారం ఉన్నా పట్టించుకోవడం లేదు. జిల్లాలో బెల్టు షాపులు నిర్వహిస్తున్న తెలుగుదేశం నేతలు సైతం అధికారులను లెక్క చేయడం లేదు. ఎవరైనా ప్రశ్నిస్తే మా ప్రభుత్వం అధికారంలో ఉంది. మమ్మల్నెవరు ఆపేదంటూ ఎదురు తిరుగుతున్నారు.

మొబైల్ ఫోన్ల ద్వారా అమ్మకాలు...

మొబైల్ ఫోన్లో బుక్ చేస్తే చాలు ఇంటికే మద్యం డెలివరీ చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలోని పశ్చిమ ప్రకాశంలో ఒక పట్టణంలో ఆటో ద్వారా ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో మాత్రమే మద్యం దుకాణలు ఉండగా పల్లెల్లో బెల్టు షాపులు ఉన్నాయి. మద్యం దుకాణాల కంటే బెల్టు షాపులే ఎక్కువగా ఉండడంతో పచ్చని పల్లెలు నిషాతో తూగుతున్నాయి. పల్లెలు, పట్టణాల తేడా లేకుండా యువకులు, రైతు కూలీలు, రోజువారి కూలీలు నిత్యం మందు తాగి పనులకు వెళ్లకుండా తిరుగుతున్నారని, దాంతో సామాన్య ప్రజల కుటుంబాలు ఆకలితో అల్లాడుతున్నాయని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిన్న మొన్నటి వరకు కుటుంబాన్ని పోషించిన వ్యక్తి నేడు మందుకు అలవాటు పడిపోయి తిరుగుతుంటే పిల్లాపాపలు చదువు మానుకొని పనులకు వెళుతున్నారని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం మీద మహిళలు మండిపడుతున్నారు.

ఎక్సైజ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదు



మా పంచాయతీలోని బసిరెడ్డిపల్లె గ్రామంలో చీప్‌లిక్కర్ అధిక ధరలకు అమ్ముతున్నారు. మందుబాబులు విచ్చలవిడిగా తాగి రాత్రి, పగలు తేడా లేకుండా బజారుల్లో తిరుగుతున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.
– చీరాల ఇజ్రాయేలు, కొచ్చర్లకోట, దొనకొండ మండలం

మద్యాన్ని ఆదాయ వనరుగా చూడటం సిగ్గుచేటు



మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదాయ వనరుగా భావించడం సిగ్గుచేటు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.30 వేల కోట్ల అమ్మకాలు జరగడం పరిస్థితిని తెలుపుతోంది. మద్యాన్ని నియంత్రించి నిరుపేద సామాన్యుల కుటుంబాలకు అండగా నిలబడాల్సిన ప్రభుత్వమే మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించడం బాధాకరం. మహిళలపై దాడులకు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యాన్ని నిషేధించాలి.
– కంకణాల రమాదేవి, ఐద్వా జిల్లా కార్యదర్శి.

విచ్చలవిడి బెల్ట్‌షాపులపై చర్యలేవీ..



మద్యం షాపుల్లో వసూలు చేస్తున్న అధిక ధరలను, గ్రామాల్లో బెల్టు షాపులను పూర్తిగా అరికడతామని సీఎం చంద్రబాబు తెలిపారు. బెల్టుషాపు నిర్వహిస్తూ పట్టుబడితే రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామని ప్రగల్భాలు పలికినా క్షేత్రస్థాయిలో అవేవీ అమలు కావడం లేదు. ప్రతి లైసెన్సు షాపు నుంచి నెలనెలా వచ్చే మామూళ్లను నొక్కేస్తూ ఎక్సైజ్ అధికారులు పట్టీ పట్లనట్లు ఉండటంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలుస్తున్నాయి. గత ప్రభుత్వంలో మద్యం షాపులు ఊరికి చివరిలో మాత్రమే ఉండేవి. నేడు ఆ పరిస్థితి లేదు.
– వల్లపోలు బాలకోటిరెడ్డి, మాజీ సర్పంచ్, శింగరబొట్లపాలెం



విద్యార్థినులకు మెమొంటోలు, సర్టిఫికెట్లను అందజేస్తున్న డీఈఓ కిరణ్‌కుమార్

సమస్యలను పరిష్కరించేలా ఆలోచించాలి

ఒంగోలు సిటీ: వ్యవస్థాపక మనస్తత్వం పెంపొందించుకోవడం, సమాజంలో ఉండే సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేలా ఆలోచించడం వలన పారిశ్రామికవేత్తగా ఎదగవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.కిరణ్ కుమార్ అన్నారు. ఒంగోలు పట్టణంలోని పీవీఆర్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంటర్ ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ జిల్లా స్థాయి ప్రాజెక్టు ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు సరైన నైపుణ్యాలు పెంపొందించుకుంటేనే ఉపాధి కల్పించే స్థాయికి చేరవచ్చన్నారు. పాఠశాల విద్యాశాఖ, ఉద్యం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 10 మంది విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. అందులో నుంచి రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. బేస్తవారిపేట బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్‌కు ప్రథమస్థానం, జంగంగుంట్ల జెడ్పీ పాఠశాల ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు డీఈఓ తెలిపారు. ఈ విద్యార్థులు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు హాజరు కావాలన్నారు. డీఈఓ కిరణ్‌కుమార్ మెమొంటోలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి మర్రిబోయిన శ్రీను, ఏఎంఓ రమేష్, జిల్లా సైన్స్ అధికారి టీ రమేష్, పాఠశాల హెచ్ఎం జిల్లా జ్యూరీ మెంబర్స్ బి.తిరుపతయ్య, కె.కె.ఎస్ రవికాంత్, ఈఎండీపీ కోఆర్డినేటర్లు రమణకుమారి, నీలిమ పాల్గొన్నారు.

స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌లలో స్లాట్ బుకింగ్

ఒంగోలు సబర్బన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో స్థిరాస్తి రిజిస్ట్రేషన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా స్లాట్ బుకింగ్ విధానాన్ని శుక్రవారం నుంచి అమలులోకి తీసుకొచ్చింది. మొదటి విడతగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉన్న ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రతి రోజూ 78 డాక్యుమెంట్లు చేసేలా సమయాన్ని కేటాయించారు. మొదటి రోజు స్లాట్ బుకింగ్ ద్వారా ఒంగోలులో 40 డాక్యుమెంట్ల ద్వారా స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు జరిగాయి. అందులో ఒంగోలు జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు 25 డాక్యుమెంట్లు, జాయింట్–2 సబ్ రిజిస్ట్రార్ కె.రాంబాబు 15 డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ డిజిటల్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ రిజిస్ట్రేషన్.ఏపీ.జీఓవీ.ఇన్‌లో స్లాట్ బుకింగ్ మాడ్యూల్ ద్వారా చేసుకోవాలన్నారు.

చేతికొచ్చిన పంట నేలపాలు

మరో పది రోజుల్లో పంట చేతికి వస్తుందనే ఆనందంతో ఉన్న రైతులకు ఊహించని పరిణామం చోటు చేసుకుంది. ఆనందంగా ఉన్న రైతుల కుటుంబాల్లో ప్రకృతి ప్రకోపం కన్నీరు మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి పండించుకున్న పంటలు ఒక్క గాలివానకు నేలకొరిగిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులకు అరటి, బొప్పాయి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వందల ఎకరాల్లో పంట నష్టపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

- జిల్లాలో అకాల వర్షాలకు 215 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- మూడు మండలాల్లోని 262 మంది రైతులకు నష్టం
- పెనుగాలులకు నేలకొరిగిన అరటి, బొప్పాయి తోటలు
- పిడుగుపాటుకు మూడు గేదెల మృతి
- నష్టపరిహారం అందించాలంటున్న రైతులు



బేస్తవారిపేట మండలంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏపీ వ్యవసాయశాఖ అధికారులు



కొమరోలులో పూర్తిగా నేలమట్టమైన అరటితోట

ఒంగోలు సబర్బన్: జిల్లాలో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు వివిధ రకాల పంటలు 215 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. పశ్చిమ ప్రాంతంలో గురువారం సాధారణ స్థాయి నుంచి ఒక మోస్తరు వర్షం కురిసింది. ప్రధానంగా మూడు మండలాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనాలు రూపొందించారు. అందులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోని పంటలు 194 హెక్టార్లు కాగా, ఉద్యాన శాఖ ఆధ్వర్యంలోని పంటలు 21 హెక్టార్లు ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా మొక్కజొన్న 178.40 హెక్టార్లలో దెబ్బతింది. అలసంద 10 హెక్టార్లలో, వరి 4.04 హెక్టార్లలో, మినుము ఒక హెక్టారులో, అరటి 11 హెక్టార్లు కాగా, బొప్పాయి 8 హెక్టార్లలో, కూరగాయలు 2 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు అంచనాలు రూపొందించారు. వాస్తవానికి పంట నష్టం ఇంకా ఎక్కువగానే ఉంది. సీఎస్‌పురం, బేస్తవారిపేట, వెలిగండ్ల, పుల్లలచెరువు, కొమరోలు, యర్రగొండపాలెం మండలాల్లోని మొత్తం 262 మంది రైతులు తమ పంటలను నష్టపోయినట్లు అధికారులు తెలిపారు.

35.8 సెంటీ మీటర్ల వర్షం కురిసింది

జిల్లాలో గురువారం పలు మండలాల్లో 35.8 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా యర్రగొండపాలెంలో 6.6 సెం.మీ, పుల్లలచెరువులో 4.6 సెం.మీ వర్షం కురిసింది. కొమరోలులో 2.6, త్రిపురాంతకంలో 2.4, బేస్తవారిపేటలో 2.4 కురవగా 1.7 నుంచి 1.1 సెంటీ మీటర్లు దోర్నాల, దొనకొండ, అర్థవీడు, కొనకనమిట్ల, పెద్దారవీడు, పొదిలి, దర్శి, వెలిగండ్ల మండలాల్లో కురిసింది. కురిచేడు, హనుమంతునిపాడు, గిద్దలూరు, కనిగిరి, తర్లుపాడు, రాచర్ల, మార్కాపురం, కంభం, పామూరు మండలాల్లో చిరుజల్లులు మొదలుకొని ఒక మోస్తరు వర్షం కురిసింది. మిగతా 16 మండలాల్లో వర్షం లేదు.

అరటి రైతుల ఆక్రందన

కంభం: కంభం మండలంలో గురువారం సాయంత్రం, అర్ధరాత్రి ఓ మోస్తారు వర్షం కురిసినప్పటికీ పెనుగాలులు తీవ్రంగా వీచడంతో కంభం చెరువు ఆయకట్టు కింద సాగవుతున్న పలు అరటి తోటలు నేలకొరిగాయి. కంభం, పోరుమామిళ్లపల్లి, చింతలపాలెం, సోమవారిపేట, హజరత్‌గూడెం, కాగితాల గూడెం పరిధిలో సుమారు 250–300 ఎకరాల్లో అరటి తోటలు సాగులో ఉన్నాయి. కొందరి అరటి తోటలు కోత దశలో ఉండగా, మరికొందరి తోటలు వివిధ దశల్లో ఉన్నాయి. వీచిన పెనుగాలులకు చిన్నకంభం, పోరుమామిళ్లపల్లి పరిధిలో కోత దశలో ఉన్న సుమారు 20 ఎకరాల్లో అరటి తోటలు గెలలతో సహా నేలకొరిగిపోయాయి. ఇంకా కొందరు రైతులకు చెందిన తోటల్లో ఎకరాకు 100–150 చెట్ల వరకు నేల కొరిగిపోవడంతో రూ.40 – రూ.50 లక్షల పంట నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేసుకున్న అరటి తోటలు ఇలా ఒక్కసారిగా నేలకొరిగిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

కొమరోలులోనూ..

కొమరోలు: మండలంలో గురువారం సాయంత్రం వీచిన భారీ ఈదురు గాలులు, వర్షానికి 30 ఎకరాల్లో అరటిపంట నష్టం వాటిల్లినట్లుగా రైతులు తెలిపారు. బ్రాహ్మణపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో భారీ ఈదురు గాలులు వీయడంతో ఆ ప్రాంతంలోనే అరటి పంట పూర్తిగా నేలమట్టమైంది. 10 రోజుల్లో అరటి గెలలు కోయడానికి సిద్ధమవుతున్న రైతులు అవి నేల మట్టం కావడంతో లబోదిబోమంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

పిడుగు పాటుకు 3 గేదెలు మృతి

ఈదురు గాలులు, భారీ వర్షం, పిడుగులు పడడంతో కొమరోలు మండలంలో 3 గేదెలు మృతిచెందాయి. మండలంలోని ఇడమకల్లు గ్రామంలో మల్లెపోగు యాకోబుకు చెందిన రెండు గేదెలను పాక సమీపంలో కట్టివేసి ఉంచగా పిడుగుపాటుకు రెండు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. వాటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే మదవపల్లె గ్రామంలో పీరయ్యకు చెందిన ఒక గేదె పిడుగుపాటుకు మృతిచెందింది.



ఇడమకల్లు గ్రామంలో మృతిచెందిన గేదెలు

446 ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం

బేస్తవారిపేట: అకాల వర్షాలకు 446 ఎకరాల్లోని మొక్కజొన్న పంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని బసినేపల్లె, ఎంపీ చెరువు, పీవీ పురం, పూసలపాడు, మోక్షగుండం గ్రామాల్లో మొక్కజొన్న పంట గాలులకు నేలకొరిగిందన్నారు. గ్రామాల్లో పర్యటించి ప్రాథమిక నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు. మండలంలోని జెన్నివారిపల్లె, గలిజేరుగుళ్ల, అక్కపల్లె, గంటాపురం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ అధికారులు నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి గ్రామాలకు విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు.

అకాల వర్షాలకు ఉద్యాన పంటలకు నష్టం

యర్రగొండపాలెం: అకాల వర్షాలకు ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లింది. గురువారం సాయంత్రం కురిసిన ఈ వర్షం వలన 35 ఎకరాల్లో వేసిన బొప్పాయి, అరటి, టమోటా పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని ఉద్యాన శాఖాధికారి ఆదిరెడ్డి తెలిపారు. యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి, పందివానిపల్లె, పుల్లలచెరువు మండలంలోని రాచకొండ గ్రామాల్లో 12 మంది రైతులు 28 ఎకరాల్లో వేసిన బొప్పాయి పంట గాలి, వర్షానికి పూర్తిగా దెబ్బతినడంతో వారికి దాదాపు రూ.28 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల్లో 4 ఎకరాల్లో వేసిన టమోటాకు రూ.2.80 లక్షలు, 3 ఎకరాల్లో వేసిన అరటి పంటకు రూ.6.75 లక్షల వరకు నష్టపోయి ఉంటారన్నారు.

కాపుపై ఉన్న బొప్పాయి పంట నష్టపోయా




రెండు ఎకరాల్లో బొప్పాయి పండిస్తున్నాను. మంచి కాపుపై ఉన్న సమయంలో అకాల వర్షానికి పంట పూర్తిగా దెబ్బతింది. దీనివలన రూ.1.80 లక్షల వరకు నష్టపోయాను.
– టి.నాగయ్య, కొమరోలు

అరటి గెలలతో సహా చెట్లు నేలకొరిగాయి



రెండున్నర ఎకరాల్లో అరటి తోట వేశాను. చెట్లన్నీ గెలలు కాసి కోతకు వచ్చి ఉన్నాయి. మార్కెట్‌లో ధర కూడా ఉండటంతో పెట్టుబడులు వస్తాయని నమ్మకంగా ఉండగా గురువారం రాత్రి వీచిన గాలులకు గెలలతో సహా చెట్లు నేలకొరిగిపోయాయి. అధికారులు పరిశీలించి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి.
– షేక్ ఇబ్రహీం, అరటి రైతు, కంభం

ప్రభుత్వం ఆదుకోవాలి



చిన్నకంభం ఇలాఖాలో మూడు ఎకరాల్లో అరటి తోట వేశాను. ఇప్పుడే గెలలు కోతకు వచ్చాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పెంచుకున్న అరటి తోటలు ఆకస్మికంగా వీచిన గాలులకు ఇలా నేలకొరిగిపోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లింది. పంటనష్టం జరిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
– మజీద్, అరటి రైతు

క్లుప్తంగా

ఏకేయూ పెన్ కాక్ సిలాట్ పురుషుల జట్టు ఎంపిక



పెన్‌కాక్ సిలాట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ఒంగోలు సిటీ: నార్త్ బెంగళూరు యూనివర్శిటీలో ఈ నెలలో జరిగే ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ పెన్ కాక్ సిలాట్ పోటీల్లో పాల్గొనేందుకు ఆంధ్రకేసరి యూనివర్శిటీ పురుషుల జట్టును స్థానిక యూనివర్శిటీ ప్రాంగణంలో శుక్రవారం ఎంపిక చేశారు. జట్టులో కే ప్రేమ్‌కుమార్, కే సాయిరామ్, షేక్ అక్రం, ఎం.శివయ్య అనే నలుగురు క్రీడాకారులు స్థానం సంపాదించారు. పెన్ కాక్ సిలాట్ జట్టు ఎంపిక కార్యక్రమంలో ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఐ.దేవీవరప్రసాద్, ఏకేయూ క్రీడాకారుల సెలక్షన్ కమిటీ సభ్యులు జి.సాయిసురేష్ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఏకేయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు తదితరులు అభినందించారు. పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

మార్కాపురం: ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలోని కళాశాల రోడ్డులో నూతనంగా ప్రారంభిస్తున్న ఓ షోరూమ్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ ఎస్సై రాజమోహన్‌రావు కథనం ప్రకారం.. మార్కాపురం పట్టణంలోని నాగులపుట్ట వీధిలో నివాసముండే గుర్రాల మహేష్(25) నూతనంగా ప్రారంభించనున్న వస్త్ర షోరూమ్‌లో చేరాడు. గురువారం రాత్రి పనిచేసిన అనంతరం సిబ్బంది ఇంటికి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం సిబ్బంది వచ్చి చూడగా మహేష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

మైనింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం

- మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

మద్దిపాడు: మైనింగ్ రంగంలో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుడదామని మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లో ఉన్న ఎస్ఈజెడ్ లో మంత్రి శుక్రవారం మధ్యాహ్నం పర్యటించారు. గ్రానైట్ శ్లాబుల కటింగ్, క్వార్ట్జ్ నుంచి బిల్డింగ్ మెటీరియల్ తయారీ యూనిట్లను స్థానిక ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1500కి పైగా మైనింగ్ సంస్థలు ఉన్నాయని, సెజ్ లో 100కి పైగా ప్లాంట్స్ ఏర్పాటు చేయడం ఇక్కడి అవకాశాలకు నిదర్శనమన్నారు. త్వరలోనే నూతన పాలసీతో మైనింగ్ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. ప్రాసెసింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు, ఎగుమతితో ఆదాయం పెంచుకునే మార్గాలను మెరుగుపరుచుకుందామన్నారు. ఈ సందర్భంగా సెస్ తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. గ్రోత్ సెంటర్ గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్, ప్రకాశం జిల్లా గ్రానైట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆళ్ల రవి, రాజేంద్ర సంత్వాల్, మహేష్, కె.రామ్మోహన్ రావు, శివరాం, ఉదయ్, మద్దిపాడు టీడీపీ అధ్యక్షుడు జయంత్ బాబు పాల్గొన్నారు.

బాలికలకు కేజీబీవీల పిలుపు

- ప్రారంభమైన దరఖాస్తుల ప్రక్రియ
- జిల్లాలో 28 కస్తూర్బా పాఠశాలలు
- 6వ తరగతిలో 1120 సీట్లకు, 11వ తరగతిలో 1120 సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం
- 7, 8, 9, 10, 12 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ
- ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశం



రాయవరంలో కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల

మార్కాపురం/పామూరు: గ్రామీణ ప్రాంతాలకు చెంది బడిఈడు పిల్లలు, బడి మానేసిన బాలికలకు విద్యనందించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయాలను ఏర్పాటు చేశాయి. జిల్లాలో బాలికల అక్షరాస్యతా శాతం తక్కువగా ఉన్న మండలాలను గుర్తించిన ప్రభుత్వం 28 కస్తూర్బా పాఠశాలలు ఏర్పాటు చేసింది. వాటిలో 6వ తరగతి ప్రవేశానికి, ఇంటర్ మొదటి సంవత్సరంతో పాటు 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు మార్చి 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఒక్కొక్క పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయి. 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో 1120 మంది బాలికల ప్రవేశానికి నోటిఫికేషన్ జారీచేసింది. బడి మానేసిన, బడి ఈడు పిల్లలను ఉపాధ్యాయులు సర్వే నిర్వహించి గుర్తిస్తుంటారు. వారిలో బాలికలను సమీప గురుకుల విద్యాలయాల్లో చేర్పించాలని ప్రత్యేక అధికారులకు సర్వే నివేదికలు అందాయి.

పాఠశాల ప్రత్యేకతలు..

కస్తూరిబాగాంధీ గురుకుల విద్యాలయాల్లో బాలికలకు ఉచిత విద్యతో పాటు, ఉచిత వసతి అందిస్తారు. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు, ట్రంకు పెట్టెలు ఉచితంగా అందజేస్తారు. అలాగే కాస్మోటిక్ కిట్లను అందజేస్తారు. రోజూ ఉదయం పాలతో పాటు టిఫిన్, సాయంత్రం చిరుతిళ్లు, గురు, శనివారాల్లో స్వీట్స్, శని, ఆదివారాలు మినహా మిగతా రోజుల్లో కోడిగుడ్డుతో తయారు చేసిన కర్రీ ఇస్తారు. వారంలో 7 రోజులు 7 రకాల మెనూలను విద్యార్థులకు అందిస్తున్నారు. ప్రత్యేక అధికారి నుంచి టీచర్లు, వాచ్‌మెన్, స్వీపర్ వరకు అందరూ మహిళలే ఉంటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన సాగుతుంది.

జిల్లాలో ఉన్న ఇంటర్మీడియెట్‌కు సంబంధించి కేజీబీవీల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయి. మూడు కళాశాలల్లో ఒకేషనల్ కోర్సులు ఉన్నాయి. విద్యార్థులకు నైట్ స్టడీ అవర్స్‌తోపాటు కెరీర్ గైడెన్స్‌పై కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 6వ తరగతిలో ప్రవేశం పొందితే పదో తరగతితో పాటు ఇంటర్మీడియెట్ వరకు చదువుకోవచ్చు. ఒకవేళ ఇంటర్‌లో చేరితే రెండేళ్ల పాటు చదువుకోవచ్చు.

ప్రాధాన్యత ప్రకారం ఎంపిక..

కస్తూరిబాగాంధీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు మొదట బడిమానేసిన పిల్లలు, తల్లిదండ్రులు లేని చిన్నారులు, ఎస్సీ, ఎస్టీ వారికి ప్రాధాన్యత ఇస్తారు. పాఠశాలలో చేరేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు.

అర్హతలు ఇలా....

కేజీబీవీల్లో ప్రవేశాల్లో అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడిమానేసినవారు) పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే తొలి ప్రాధాన్యతగా సీట్లు కేటాయిస్తారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను మాత్రమే అడ్మిషన్ కోసం పరిగణిస్తారు. విద్యార్థినులు తమ దరఖాస్తును వెబ్‌సైట్ 'ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్' లో పొంది దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికైన బాలికలకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది.

గ్రూపుల వారీగా ఇంటర్మీడియెట్ కోర్సులు నిర్వహిస్తున్న కేజీబీవీలు

ఎంపీసీ : అర్థవీడు, బీ.వీ.పేట, దర్శి, దొనకొండ, కనిగిరి (ఎంఐఎస్), కొనకనమిట్ల, కొమరోలు, ముండ్లమూరు, పెద్దారవీడు, పెద్దదోర్నాల, పామూరు, పొన్నలూరు, రాచర్ల, త్రిపురాంతకం, వెలిగండ్ల, జరుగుమల్లి.
బైపీసీ: సీఎస్‌పురం, కొత్తపట్నం, మర్రిపూడి, పీ.సీ.పల్లి, పుల్లలచెరువు, తాళ్లూరు, తర్లుపాడు, వై.పాలెం
ఎంఈసీ : పొదిలి (ఎంఐఎస్)
సీఎస్ఈ : హెచ్ఎంపాడు
ఏఅండ్‌టీ : మార్కాపురం
ఎంఎల్‌టీ : కురిచేడు

నాణ్యమైన విద్యను అందిస్తున్నాం



కస్తూరిబా గాంధీ విద్యాలయంలో బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం. మంచి భోజన వసతి ఉంది. విద్యార్థిని ఆధార్ నంబర్లు, తల్లిదండ్రుల ఆధార్ నంబర్లు తీసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. క్రీడలపై శిక్షణ ఇస్తున్నాం. వ్యర్థ వస్తువులతో వివిధ రకాల ఆకృతులు తయారు చేసే విధానంపై శిక్షణ ఇస్తున్నాం. వచ్చే నెల 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

– విజయలక్ష్మి, కేజీబీవీ ప్రత్యేక అధికారిణి, రాయవరం

దరఖాస్తులు స్వీకరణ



జిల్లాలోని 28 కేజీబీవీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. మార్చి 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తాం. ఈ అవకాశాన్ని బాలికలు సద్వినియోగం చేసుకోవాలి. కేజీబీవీల్లో అందుతున్న నాణ్యమైన విద్యపై సమీప పాఠశాలల టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు చైతన్యపరిచి బాలికలను కేజీబీవీల్లో చేర్పేందుకు చర్యలు చేపట్టాలి.

– కే.హేమలత, జీసీడీఓ, సమగ్రశిక్ష

చక్కని బోధన



మేము మంచి విద్యను పొందుతున్నాం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను బోధిస్తున్నారు. ప్రశాంతమైన వాతావరణం ఉంది. మా ఇంటి దగ్గర మా తల్లిదండ్రులు కల్పించలేని సౌకర్యాలు కూడా కల్పిస్తున్నారు.

– నిషాలక్ష్మి, 9వ తరగతి, కేజీబీవీ, పామూరు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- వేసవి దృష్ట్యా ముందస్తు చర్యలు చేపట్టాలి
- చలివేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలి
- అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సబర్బన్: ఈ వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరా, వడగాడ్పులపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తపై సంబంధిత శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో కలెక్టర్ సమీక్షించారు. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేసవిలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. మున్సిపల్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల అధికారులు వేసవిలో తాగునీటి సరఫరాపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పటిష్టంగా అమలు చేయాలన్నారు. సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండలస్థాయి అధికారులు కూడా తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఎక్కడా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని, బోర్ వెల్స్ పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించాలని సూచించారు. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేందుకు రక్షిత తాగునీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు చేయించాలన్నారు.

వడగాడ్పులపై ప్రజలను అప్రమత్తం చేయాలి...

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాడ్పులపై ప్రజలను అప్రమత్తం చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీ, మండల కేంద్రంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో అధికంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. బస్టాండ్, రైల్వేస్టేషన్లు, ఆటో స్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, షామియానాలు వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్యలో ఎవరూ ఎండలో తిరగరాదన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగులు, క్యాపులు వినియోగించాలన్నారు. ఒదులుగా ఉండే కాటన్ దుస్తులే ధరించాలని, వడదెబ్బ తగిలిన వారికి తక్షణమే గ్లూకోజ్ వంటివి ఇవ్వాలని, తడిగుడ్డతో తుడవాలని, తదుపరి మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో డిజాస్టర్ మేనేజ్మెంట్ డీపీఎం మాధురి, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకర రావు, డ్వామా పీడీ జోసఫ్ కుమార్, డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబు, ఐసీడీఎస్ పీడీ హేనసుజన, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, గ్రౌండ్ వాటర్ డీడీ విద్యాసాగర్, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బేబీరాణి, తదితర అధికారులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జేసీ

ఒంగోలు సబర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జ్‌గా జాయింట్ కలెక్టర్, జిల్లా అదనపు మేజిస్ట్రేట్ రోణంకి గోపాలకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా గ్రంథాలయ సంస్థలకు సంబంధించిన వ్యవహారాలు నిర్వహించడానికి జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థకు జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి రావాల్సిన గ్రంథాలయ సెస్సు బకాయిల వసూలుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న జేసీని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు నిర్వహించిన గ్రంథాలయాల వ్యవహారాలను గోపాలకృష్ణకు ఆమె వివరించారు.



జేసీ గోపాలకృష్ణను అభినందిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి

శ్రీశైలం ఘాట్‌లో త్రుటిలో తప్పిన ప్రమాదం

- వేగంగా వెళ్తున్న కారులో చెలరేగిన మంటలు
- డ్రైవర్ సమయ స్ఫూర్తితో ప్రయాణికులు సురక్షితం



శ్రీశైలం రోడ్డులో తగలబడుతున్న కారు



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పెద్దదోర్నాల: వేగంగా వెళ్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగిన సంఘటన శుక్రవారం శ్రీశైలం ఘాట్ రోడ్డులోని చింతల గిరిజనగూడెం సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించటంతో వాహనంలో ప్రయాణిస్తున్న వారు ఎటువంటి ప్రమాదానికి గురి కాకుండా సురక్షితంగా బయటపడ్డారు. అందిన సమాచారం మేరకు.. గుంటూరుకు చెందిన రవీంద్రకుమార్ తన మిత్రుడైన కొమ్మూరి శ్రీనుకు చెందిన రెనాల్ట్ కారును తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి దైవ దర్శనం కోసం శ్రీశైలానికి బయలు దేరాడు. ఈ క్రమంలో చింతల గిరిజన గూడెం దాటి ఘాట్‌లో ప్రయాణిస్తున్న సమయంలో కారు ఇంజన్ భాగంలో ఒక్కసారిగా దట్టమైన పొగలతో మంటలు చెలరేగాయి. ఈ సమయంలో డ్రైవర్ చాకచక్యంగా వేగాన్ని నియంత్రించి కారును రోడ్డుకు ఓ పక్కకు నిలిపి వేయటంతో ప్రయాణికులు సురక్షితంగా బయట పడ్డారు. ఈ సమయంలో డ్రైవర్ కంగారుకు గురైతే పక్కనే ఉన్న భారీ లోయలోకి కారు దూసుకు వెళ్లేదని, త్రుటిలో పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నామని కారులో ప్రయాణిస్తున్న రవీంద్రకుమార్ కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఫైర్ అధికారులు సిబ్బందితో కలిసి అగ్నిమాపక వాహనంతో సంఘటనా స్థలికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు. ఇంజన్ భాగంలోని బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్ తోనే మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. కారులో మంటలు వ్యాపించిన సమయంలో పెద్ద పెద్ద శబ్దాలు రావటంతో శ్రీశైలం ఘాట్‌లో ప్రయాణించే వాహనదారులు ఒకింత ఆందోళనకు గురయ్యారు.

ఇథనాల్ బ్యారల్స్ పట్టివేత

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి సమీపంలో గురువారం రాత్రి 27 ఇథనాల్ బ్యారల్స్‌ను విజిలెన్స్ డీటీ రాజ్యలక్ష్మి పట్టుకుని సీజ్ చేశారు. అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారంతో మద్దిపాడు తహసీల్దార్ నృజన్‌కుమార్‌తో కలిసి దాడిచేసి పట్టుకుని సీజ్ చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- సంతనూతలపాడు, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లో ప్రమాదాలు
- బైక్ ప్రమాదాల్లో యువకుడు, మహిళ దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు
- లారీని మరో వాహనం ఢీకొన్న ఘటనలో రైతు మృతి, పలువురికి గాయాలు



గొబ్బూరు సమీపంలో బోల్తా పడిన జీపును పరిశీలిస్తున్న పోలీసులు



ముందు భాగం నుజ్జునుజ్జయిన మిర్చి లోడ్ ట్రక్



మృతి చెందిన విజయభాస్కర్

పెద్దదోర్నాల/పెద్దారవీడు: యర్రగొండపాలెం నియోజకవర్గంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో సంభవించిన మూడు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందగా మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పెద్ద దోర్నాల మండలంలోని గంటవానిపల్లె సమీపంలో కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిపై బైక్‌ను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వై.చర్లోపల్లికి చెందిన పాముల విజయభాస్కర్(25), అతని సన్నిహితుడు కటారి పోల్‌రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ తన సిబ్బందితో కలిసి హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను పెద్దదోర్నాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే విజయభాస్కర్ మృతి చెందినట్లు వైద్యాధికారి లావణ్య ధ్రువీకరించారు. మండలానికి చెందిన 108 వాహనం ఇతర ప్రాంతానికి వెళ్లిన నేపథ్యంలో ఎస్సై తన వాహనంలోనే క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. విజయభాస్కర్ ప్రాణాలు కాపాడేందుకు ఎస్సై మహేష్ చేసిన ప్రయత్నం ఫలించలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దారవీడు మండలంలో..

రోడ్డుపై అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించపోయిన జీపు అదుపుతప్పి బోల్తాపడగా అదే సమయంలో అక్కడ నిలిపిన లారీని వెనుక నుంచి వచ్చిన మరో ట్రక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ రైతు మృతి చెందగా, మరో రైతు, డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి పెద్దారవీడు మండలంలోని గొబ్బూరు–తోకపల్లి గ్రామాల మధ్య చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై గుంటూరు వైపు వెళ్తున్న జీపు అదుపుతప్పి బోల్తా పడింది. వెనకాల వస్తున్న లారీ డ్రైవర్ గమనించి అకస్మాత్తుగా నడిరోడ్డుపై నిలిపివేశారు. జీపులో ఉన్న వారిని రక్షించేందుకు డ్రైవర్, క్లీనర్ కిందకు దిగి వెళ్తుండగా వీరి లారీని మిరపకాయల లోడుతో వస్తున్న ట్రక్ ఢీకొట్టింది. చిమ్మచీకటి, వర్షం కారణంగా సంభవించిన ఈ ప్రమాదంలో మిర్చి ట్రక్‌లో ఉన్న ఇద్దరు రైతులతో పాటు డ్రైవర్, క్లీనర్‌కు గాయాలయ్యాయి. రైతు ఖాసిం మృతి చెందగా మరో రైతు, డ్రైవర్‌ను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. కాగా, బోల్తా పడిన జీపులో ప్రయాణిస్తున్న 13 మందిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.అనిల్‌కుమార్ తెలిపారు.

సంతనూతలపాడు మండలంలో...


సంతనూతలపాడు: మండలంలోని ఎనికపాడు – గుమ్మలంపాడు రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనికపాడు గ్రామానికి చెందిన ఎర్రగుంట్ల సుబ్బాయమ్మ (55) మృతి చెందింది. ఎనికపాడు గ్రామానికి చెందిన దర్శి సుబ్రహ్మణ్యం మోటార్ సైకిల్‌పై సుబ్బాయమ్మ గుమ్మలంపాడు వెళుతుండగా, మార్గం మధ్యలో గొర్రెలు తగిలి ఆమె కిందపడింది. గాయపడిన ఆమెను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఒంగోలు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందింది.

తప్పుడు కేసుకు ఒప్పుకోలేదని..

- ఎండీయూ వాహనాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలెంలో గురువారం సాయంత్రం రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సీజ్ చేశారు. ఎండీయూ ఆపరేటర్ అంకయ్య కథనం మేరకు.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివరామకృష్ణ, ఎఫ్ఐ ప్రమోద్ వాహనాన్ని తనిఖీ చేశారు. 100 కేజీల రేషన్ బియ్యానికిగాను 50 కేజీల బస్తా ఒకటి, మరో బస్తాలో 33 కేజీలు ఉన్నాయి. అయితే 50 కేజీలు తక్కువగా ఉన్నాయని అధికారులు నివేదిక రాసుకున్నారు. ఆ మేరకు సంతకం చేయాలని ఒత్తిడి చేశారు. వెంకయ్య అందుకు అంగీకరించకపోవడంతో ఎండీయూ వాహనాన్ని అధికారులు తీసుకెళ్లిపోయారు. దీనిపై టంగుటూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు తీసుకోలేదని, జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని అంకయ్య చెప్పారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరుడిని అనే కక్షతో అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు.

క్రికెట్ బెట్టింగులపై నిఘా



క్రికెట్ బెట్టింగులపై తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: క్రికెట్ బెట్టింగులకు యువత దూరంగా ఉండాలని, బెట్టింగులకు పాల్పడే వారిపై గట్టి నిఘా పెట్టామని ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం డీఎస్పీ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండు, అద్దంకి బస్టాండు సెంటర్, నెల్లూరు బస్టాండు, మంగమూరు రోడ్డు, తదితర ముఖ్య కూడళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 15 బృందాలుగా ఏర్పడిన పోలీసులు బెట్టింగులకు పాల్పడే వారిని గుర్తించేందుకు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గుంపులుగా వున్న వారి ఫోన్లను పరిశీలించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ఆన్‌లైన్ బెట్టింగులు పాల్పడుతుంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సుమారు 1000 మంది ఫోన్లను పరిశీలించగా 18 మంది ఫోన్లలో అనుమానాస్పద యాప్లను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతున్న నేపథ్యంలో బెట్టింగులకు పాల్పడేవారిని గుర్తించేందుకు ప్రత్యేక తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో వన్‌టౌన్ సీఐ నాగరాజు, తాలూకా సీఐ అజయ్ కుమార్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సైలు పాల్గొన్నారు.